
# 'ఈటల' తట్టెడు మట్టి పోయలే

- రూ.19వేల కోట్లతో రుణమాఫీ చేసిన ఘనత కేసీఆర్‌దే
- ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి
- పలు గ్రామాల్లో ముఖ్యకార్యకర్తలతో సమావేశం



కన్నూరులో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలను ఆహ్వానిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, అక్టోబర్ 17: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గెలిచి రెండేళ్లయినా నియోజకవర్గంలో తట్టెడు మట్టి పోయలేదని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండలంలోని భీంపల్లి, కన్నూరు, కొత్తపల్లి, గుండేడు గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్‌కు ఏడు సార్లు అవకాశం ఇచ్చారని, నాకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ఈటల కోసం పనిచేసిన కార్యకర్తలను ఆయన ఏనాడూ పట్టించుకోలేదన్నారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, రుణమాఫీ వంటి పథకాలతో లబ్ధిపొందని ఇల్లు లేదన్నారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంటు రాక రైతులు ఎంత ఇబ్బంది పడ్డారో అందరికీ తెలిసిందే అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రైతులకు 3 గంటల కరెంటు ఇస్తే చాలంటున్నాడని, మళ్లీ పాతరోజులు కావాలా? 24 గంటల కరెంటు కావాలా? రైతులు ఆలోచించుకోవాలన్నారు. రూ.19వేల కోట్లతో రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు గ్రామాల్లో దీనిపై చర్చ పెట్టాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు సంక్షేమ పథకాలను వివరించి, ఓటు అడుగాలన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పుల్లూరి రాంచందర్‌రావు, పద్మ, కల్యాణి, ఎంపీటీసీ వీరమనేని భాస్కర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సంపత్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, గ్రామశాఖ అధ్యక్షుడు రాజయ్య, నాయకులు లక్ష్మణ్‌రావు, కుమారస్వామి, ప్రదీప్‌రెడ్డి, సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు**

కన్నూరులో పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీజేపీకి చెందిన నూనె శంకర్, కే శ్రీనివాస్, అల్లెపు కుమార్, పెర్క శ్రీనివాస్, బచ్చల శ్రీనివాస్, బచ్చల చంద్రమౌళి, నూనె విష్ణువర్ధన్‌తోపాటు మరికొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కౌశిక్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బాధితులకు ఓదార్చుతున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

ధర్మసాగర్, అక్టోబర్ 17 : మండలంలోని ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఇంద పెద్ద కొమురయ్య (87) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు. కొమురయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రవీందర్, వైస్ చైర్మన్ యాదకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు రాధాకిషన్‌రావు, సదానందం, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## భద్రకాళీ చెరువులో మురుగునీరు చేరకుండా చర్యలు

గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 17 : భద్రకాళీ చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన భద్రకాళి చెరువు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జయ నర్సింగ్ కాలేజీ సమీపం నుంచి చెరువులోకి మురుగు నీరు రాకుండా పనులు మొదలు పెట్టాలని అన్నారు. చెరువు ప్రాంతంలోని గుంతలు పూడ్చివేయాలన్నారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని గుర్తించి, సమగ్ర నివేదిక అందజేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ



కేయూలో బతుకమ్మ సంబురాలను ప్రారంభిస్తున్న వీసీ రమేశ్ సతీమణి భావన



ప్రభుత్వ జూనియర్ కాలేజీ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డీవైఈవో గోపాల్, ప్రిన్సిపాల్ ధర్మేంద్ర

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 17 : తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ అని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ సతీమణి తాటికొండ భావన అన్నారు. విశ్వవిద్యాలయంలోని పరీక్షల విభాగం ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలను ఆమె దీపారాధన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అన్ని వర్గాలు, కులాల వారు సంతోషంతో బతుకమ్మ జరుపుకుంటారన్నారు. కాగా, సంప్రదాయ పాటలు, సామూహిక నృత్యాలతో బోధనా, బోధనేతర సిబ్బంది సందడి చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్ ) ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అన్నారు. మంగళవారం కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవైఈవో గోపాల్ హాజరై మాట్లాడుతూ పూలనే దేవతగా భావించి పూజించే ఏకైక పండుగా బతుకమ్మ అని అన్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆడుతూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాగా, ఇటీవల రెగ్యులర్ అయిన కాంట్రాక్ట్ అధ్యాపకులతో కళాశాలలో రూ.90 వేలతో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను డీఐఈవో గోపాల్, ప్రిన్సిపాల్ ధర్మేంద్ర ప్రారంభించారు.

## కాజీపేట క్రీడాకారుడికి బాక్సింగ్‌లో కాంస్య పతకం



పతకంతో సంకీర్త్

కాజీపేట, అక్టోబర్ 17 : కాజీపేట ఆర్పీఎఫ్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న (రైల్వే స్పోర్ట్స్ మెన్) సంజీవరావు కుమారుడు సంకీర్త్ బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించాడు. పదో తరగతి చదువుతున్న సంకీర్త్ సౌత్ జోన్ (సీబీఎస్ఈ) స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో చెన్నైలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగిన అండర్ 17 బాక్సింగ్ పోటీల్లో 75 కిలోల విభాగంలో పాల్గొన్నాడు. ఈ పోటీల్లో ప్రతిభను చాటి కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ మేరకు సంకీర్త్‌ను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్, పాఠశాల యాజమాన్యం, క్రీడాభిమానులు, రైల్వే అధికారులు అభినందించారు.

## 19న రైల్వే పెన్షనర్స్ సమావేశం


కాజీపేట, అక్టోబర్ 17 : కాజీపేటలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 19న మూడో త్రైమాసిక సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సంగమయ్య తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ కార్మికుల సమస్యలు, వాటి పరిష్కారం, తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## జోరుగా రైల్వే ఈసీసీఎస్ ఎన్నికల ప్రచారం

కాజీపేట, అక్టోబర్ 17 : దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) డెలిగేట్ ఎన్నికలు ఈ నెల 19న ఉండడంతో అభ్యర్థుల ప్రచారం కాజీపేటలో జోరందుకుంది. ప్రధానంగా రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, డీఎంఆర్‌కేఎస్, కార్మిక సంఘాలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయా కార్మిక నేతలు తమ పరిధిలోని సభ్యులను ప్రత్యక్షంగా కలుసుకుని తమ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే ఈసీసీఎస్ కార్యాలయం 11వ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ కార్యాలయంలో 13 మంది ఈసీసీఎస్ డెలిగేట్స్ స్థానాలు ఉన్నాయి. వీటికి 36 మంది బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గంలోని 2629 మంది రైల్వే కార్మికులు సభ్యత్వం తీసుకుని ఓటర్లుగా గుర్తింపు పొందారు. ఈ నెల 19న కాజీపేటలో జరిగే రైల్వే ఈసీసీఎస్ పోలింగ్‌లో వీరు పాల్గొని ఓటు వేయనున్నారు. రైల్వే జంక్షన్ పరిసరాల్లో ఎనిమిది ప్రాంతాలను రైల్వే అధికారులు పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశారు.

## 'చట్టాలపై అవగాహన ఉండాలి'

నయీంనగర్, అక్టోబర్ 17 : ప్రతి మహిళకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ సెంటర్ కేస్ వర్కర్ హరిత అన్నారు. రాంనగర్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సఖీ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. గృహహింస, లైంగిక వేధింపులు, పని చేసే చోట వేధింపులులాంటి వాటి నుంచి రక్షణ పొందడానికి సఖీ సెంటర్‌ను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమెన్ హబ్ సెంటర్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనాథ్

## గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

భీమదేవరపల్లి, అక్టోబర్ 17 : మండలంలోని గాంధీనగర్ గ్రామంలో వంగర ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 73 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీనాథ్ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీణ, కేఎల్ఎన్ స్వామి, సుమతి, రఫత్ ఉన్నీసాబేగం, లక్ష్మి, వినోద్, భాస్కర్ పాల్గొన్నారు.

## 'ముల్కనూరు' సంఘం నామినేషన్ల పరిశీలన

భీమదేవరపల్లి, అక్టోబర్ 17 : ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ఎన్నికల్లో భాగంగా మంగళవారం నామినేషన్ల పరిశీలన జరిగింది. సంఘంలో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలుండగా 4, 6, 10, 11, 13 నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటికి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 13వ నియోజకవర్గంలో ముగ్గురు నామినేషన్లు వేయగా మీస మహేశ్‌ను ప్రతిపాదించిన వారు తప్పుకోవడంతో అతడి నామినేషన్ తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి నీరజ వెల్లడించారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు.